క్లుప్తంగా

పలకలు పంపిణీ



పలకలతో చిన్నారులు, ఫౌండేషన్ నిర్వాహకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని గార్బియన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సాహితి ఫౌండేషన్ చైర్మన్ రాముల కుమార్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తమవంతుగా ప్రజా సేవలో పాల్గొంటున్నామని, పాఠశాలకు మొదటగా వచ్చిన 50 మంది చిన్నారి విద్యార్థులకు పలకలు అందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ మహమ్మద్ అంకూస్, టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాటిచెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్ గ్రామంలో సొప్పరి తిరుపతి అనే వ్యక్తి తన భూమిలో ఉన్న 80 తాటిచెట్లను అర్ధరాత్రి ఎలాంటి అనుమతి లేకుండా తొలగించాడని, ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు సిరిసేటి ఓదేలుగౌడ్, సర్వాయి పాపన్న మోకుదెబ్బ వ్యవస్థాక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ అన్నారు. గ్రామంలో తొలగించిన తాటిచెట్లను బుధవారం పరిశీలించారు. తాటిచెట్లను నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న గీతకార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. ఎక్సైజ్ సీఐ మాధవిలతకు ఫిర్యాదు చేశారు. అనంతరం చర్యలు తీసుకోవాలని గీతకార్మికులు డిమాండ్ చేశారు. స్పందించిన సిఐ మాధవిలత శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు ముంజాల చంద్రయ్యగౌడ్, నాయకులు రవిగౌడ్, అశోక్‌గౌడ్, ముంజాల సదయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోపగోని రాజయ్యగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి కారు అద్దాలు ధ్వంసం

శంకరపట్నం: మండలంలోని ఓ కాంగ్రెస్ నాయకుడి కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. కొత్తగట్టు గ్రామంలో భూవివాదంపై మాట్లాడేందుకు కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తిరుపతి తన కారులో వెళ్లాడు. ఓ మహిళ కొంత మంది వ్యక్తులతో కలిసి కారులో వచ్చిన వారిపై గొడవకు దిగింది. విజయ్ అనే వ్యక్తిపై కర్రతో దాడి చేయగా గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా కారుకు అడ్డుగా వచ్చి అద్దాలను ధ్వంసం చేసింది. హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

సైదాపూర్: గ్రామాల్లో సర్పంచులు లేనందున ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిందని, సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యువాత..

- సరిపడా మందులు లేక, సకాలంలో చికిత్స అందక
- పశువుల బీమా లేక ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- శిథిలావస్థలో పశువైద్యశాలు
- పట్టించుకోని జిల్లా పశువైద్య ఉన్నతాధికారులు



రామంచలో ఆరుబయటే పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యసిబ్బంది(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని పశువులకు సకాలంలో చికిత్స, అవసరమయ్యే మందులు పశువుల ఆసుపత్రుల్లో లేక మూగజీవాలు మృత్యువాతన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సరిపడా మందులు సరఫరా చేయలేదు. పశువులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ పశువైద్యశాలలకు తీసుకువెళ్లగా మందులు లేవు ప్రైవేటు మెడికల్ షాపుల్లో తెచ్చుకోవాలని పశువైద్యులు చిట్టీలు రాసి ఇస్తున్నారు. వేలల్లో ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు మృత్యువాత పడుతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు, గ్రామాల సంఖ్యకు సరిపడా పశువుల ఆసుపత్రులు, సిబ్బంది లేరు, ఉన్నవాటికి పక్కాభవనాలు కరువు. పశు సంపద కోసం పాల ఉత్పత్తి సహకార సంఘాలు రైతులకు తగిన రుణాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నప్పటికీ వాటిని రోగాల బారి నుంచి కాపాడుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన లేదంటున్నారు. మండలంలో 17 గ్రామాలుండగా చిగురుమామిడి, ఇందుర్తి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో పశువుల ఆసుపత్రులున్నాయి. మిగతా గ్రామాల్లోని రైతులకు పశువులను మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోని పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లడం కష్టంగా మారింది. అన్ని గ్రామాల్లో పశువైద్యాధికారుల లెక్కల ప్రకారం దాదాపు 12వేల పాడి పశువులున్నాయి. 36 వేల గొర్రెలు, మేకలున్నాయి. సబ్సిడీ గొర్రెలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు పశువుల కొనుగోలుకు రుణాలు అందిస్తున్న వైద్యం అందడం లేదు.

రూ. వేలల్లో నష్టం

ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పశువుల బీమా పథకం మాత్రం 2016 సంవత్సరం వరకు కొనసాగింది. అప్పటి నుంచి ఇన్సూరెన్స్ అందక రైతులు వేలల్లో నష్టపోతున్నారు. పశువుల బీమా మళ్లీ అమలు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. మండలంలోని జీవాలకు సీజనల్ వ్యాధుల చికిత్స కోసం ప్రభుత్వం 2023–24వ సంవత్సరానికి రూ. 50 వేల రూపాయల విలువ గల మందులు పంపించాల్సి ఉండగా రెండు విడతల్లో రూ. 25వేల విలువ గల మందులు వచ్చాయి. ఏటా బడ్జెట్‌ను రెండింతలు చేయాలని కోరుతున్నా జిల్లా పశువైద్య ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఏళ్లుగా కాలం వెళ్లదీత

మండలంలోని నవాబుపేట్, రామంచ, సుందరగిరి, చిన్నముల్కనూర్ గ్రామాల్లో ఆసుపత్రులను నిర్మించాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న నాలుగు పశువుల ఆసుపత్రుల్లో రెండింటికి పక్కాభవనాలు లేవు. బొమ్మనపల్లిలోని పురాతన భవనం శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న బీసీ వసతి గృహంలో నిర్వహిస్తున్నారు. రేకొండలో పశువుల ఆసుపత్రికి పక్కాభవనంలేదు. ప్రస్తుతం మహిళా సంఘం భవనంలో కాలం వెల్లదీస్తున్నారు. ఖాళీ చేయాలని ఏళ్లుగా మహిళలు కోరుతున్నప్పటికీ గత్యంతరం లేక అందులోనే కొనసాగిస్తున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



గ్రామంలోని పశువుల ఆసుపత్రి భవనం కూలిపోయే దశలో ఉంది. కొత్త భవనం నిర్మించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి. పశువుల బీమా పథకం లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించాలి.

–కంది శంకర్, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు, బొమ్మనపల్లి

వైద్యం అందడం లేదు



సుందరగిరి గ్రామం చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాలకు ఎటు చూసినా ఐదుకిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సకాలంలో పశువులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

– తాళ్లపల్లి సంపత్‌కుమార్, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, సుందరగిరి

రైతులు నష్టపోతున్నారు



గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి పశుబీమా పథకం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే బొమ్మనపల్లి, రేకండ గ్రామాల్లో పశువుల ఆసుపత్రులకు పక్కాభవనాలు లేవు. జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు నివేదికలు అందించాం.

–శ్రీధర్, పశువైద్యాధికారి, చిగురుమామిడి

పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీధర్, డీడబ్ల్యూవో సరస్వతి

తిమ్మాపూర్: ఐసీడీఎస్ కరీంనగర్‌రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయ్ మహిళా శిశు వికాస కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. సీడీపీవో సబిత అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డీవో శ్రీధర్ డీడబ్ల్యూవో సరస్వతి హాజరయ్యారు. ప్రీ స్కూల్ యాక్టివిటీస్‌పై సలహాలు, సూచనలు చేశారు. ప్రీ స్కూల్‌కి సంబంధించిన ప్రియదర్శిని, పూర్వ ప్రాథమిక విద్యా కరదీపికలోని అంశాలపై సరియైన పద్ధతిలో శిక్షణ జరగాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లకు ట్రెయినర్లు శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణకు ఐదు మండలాల నుంచి అంగన్‌వాడీ టీచర్లు హాజరవుతారని, జూన్ 19 నుంచి జూలై 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో సబిత, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

జమ్మికుంట: అంగన్‌వాడీ పిల్లల వివరాలు, ప్రీ స్కూల్‌కు సంబంధించిన కొత్త పద్ధతులు, విధానాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఐసీడీఎస్ హుజూరాబాద్ ప్రాజెక్టు అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని కేవీకేలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, పోషణ అభియాన్ సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పిల్లల్లో ఎలాంటి లోపం సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త ప్రశాంతి, జమ్మికుంట, ఇల్లందకుంట ఏపీఎంలు శ్రీనివాస్, రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిరుమల, రమ, పద్మ, శిరీష, శశి, కిరణ్మయి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ ఇరుసం నాగరాజు, జిల్లా ఐటీ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, బ్లాక్ కోఆర్డినేటర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఐసీడీఎస్ అధికారి భాగ్యలక్ష్మి, తదితరులు

హోం శాఖ సహాయ మంత్రికి ఘనస్వాగతం



గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

రామడుగు: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టుకు దర్శనానికి వెళ్తున్న బండి సంజయ్‌కుమార్‌కు మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ బస్టాండ్ వద్ద బుధవారం బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి శాలువాతో సత్కారించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్, నాయకులు ఉప్పు రాంకిషన్, బండ తిరుపతిరెడ్డి, మీసాల సునీల్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు బండి సంజయ్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు గజమాలతో సన్మానించారు.

యువత మత్తుకు బానిసవ్వొద్దు



యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోలీస్ అధికారులు

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్‌రూరల్: యువత మత్తుకు బానిసై ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలు నడుచుకోవాలని, మత్తులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, విద్యార్థి దశలో కేసులు నమోదైతే జీవితంలో ఉన్నత స్థాయికి అవరోధంగా మారుతుందన్నారు. యువత తలచుకుంటే మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించవచ్చని, అన్ని దేశాల్లో కంటే ఇండియాలోనే యువత అధికంగా ఉన్నారని, ఏది సాధించాలన్న యువతతోనే సాధ్యమవుతుందన్నారు. మత్తు పదార్థాల నిషేధానికి యువకులు తమవంతు కృషి చేయాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో సీఐలు బొల్లం రమేశ్, వెంకట్, రవి, ఎస్సైలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

హుజూరాబాద్: హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సైదాపూర్, చెల్పూర్, చల్లూరు, వీణవంక, వావిలాల, ఇల్లంతకుంట మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాల్లోని 19 ఏళ్లలోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు బుధవారం తెలిపారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందరూ పాల్గొంటారని, నులి పురుగుల వల్ల పిల్లల్లో అభ్యాసన శక్తి తగ్గుతుందని, సరిగా చదవలేరని విధిగా తల్లిదండ్రులు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కోరారు. హెచ్ఎంలు, టీచర్లు సహకరించాలని కోరారు. పిల్లలందరూ భోజనం చేసిన తర్వాతనే మాత్రలు వేయాలని, ఎటువంటి ప్రతికూల ప్రభావాలు ఉండవని, సమస్యలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని సంప్రదించాలని కోరారు. దాదాపు 53000 మంది బాలబాలికలకు మాత్రలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర, బోనాలు



పూజలు చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ



వీణవంకలో పెద్దమ్మ బోనాలు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో బుధవారం ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈకార్యక్రమంలో బసవయ్య, రవీందర్, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామంలో ఎల్లమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గౌడ కులస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, మాజీ సర్పంచ్ ఆరెల్లి సంపత్‌గౌడ్, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మార్క సంపత్‌గౌడ్, రాయమల్లు, రమణయ్య, రాజయ్య, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో ముదిరాజ్‌లు పోచమ్మ, పెద్దమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. నెత్తిన బోనాలు, డప్పుచప్పుళ్ల మధ్య ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మోటం వెంకటేశ్, శ్రీనివాస్, రాయిశెట్టి కుమార్, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

'నీట్' లీకేజీపై కేంద్రం స్పందించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

జమ్మికుంట: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై ఎన్టీఏ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సజయ్‌ను అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు జరిగిన అన్యాయంపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని, సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, ఎన్టీఏ జనరల్ డైరెక్టర్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేసి రాష్ట్ర విద్యార్థులకు అండగా ఉండాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు విద్యా వ్యాపారం చేస్తున్నాయని, ఫీజుల దోపిడీ నియంత్రణ చట్టం అమలు చేసి దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరావు వెంకటేశ్, జిల్లా కోశాధికారి అలువాల విష్ణు, నాయకులు అనిల్, తౌకీర్, అనిల్‌రెడ్డి, సాయి, వంశీ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుంగా చూడాలి



సైదాపూర్: వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సిబ్బంది విధులు నిర్వహించాలని హుజూరాబాద్ విద్యుత్‌శాఖ డీఈ లక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని వెంకేపల్లి సబ్‌స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గాలి, వానలకు విరిగిన విద్యుత్ స్తంభాలు, లూజు వైర్లు ఎప్పటికప్పుడు మరమ్మతు చేయాలన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని నిరుద్యోగులు 24న హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో జాబ్ మేళా పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, 60 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని పీజీ వరకు చదువుకున్న ప్రతి ఒక్కరు హాజరై ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో జెడ్పీఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, డీసీసీ ప్రధానకార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



హుజూరాబాద్: పండ్ల పంపిణీలో వొడితెల ప్రణవ్



మానకొండూర్‌లో కేక్ కట్‌చేస్తున్న నాయకులు



తిమ్మాపూర్: వేడుకల్లో మోరెపల్లి రమణారెడ్డి

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ హుస్నాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వీట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. దేశం కోసం నెహ్రూ కుటుంబ సభ్యులు ఎనలేని సేవలు చేశారని పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



గంగాధరలో..



చిగురుమామిడిలో జెడ్పీటీసీ గీకురు రవీందర్



గన్నేరువరం: వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



రామడుగు: ప్రశాంత్ భవన్‌లో...

విద్యార్థులకు పారితోషికం

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా విద్యార్థులకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం పారితోషికం అందజేశారు. టేకు రాధిక, పాశం రాజుకు రూ.3 వేల చొప్పున అందజేసి అభినందించారు. మెరుగైన ఫలితాలతో పాఠశాల, తల్లిదండ్రులకు మంచి గుర్తింపును తీసుకువచ్చారని. భవిష్యత్‌లో మంచి ఫలితాలను సాధిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామయ్య, ఉపాధ్యాయులు అంజయ్య, నరేందర్, రామానుజం, శ్రీలత, శంకరయ్య, వసంత, రాజబాబుపాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

మూఢనమ్మకాలను రూపుమాపాలి

వీణవంక: వితంతువుల పట్ల వివక్ష చూపొద్దని జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు. మండలంలోని వల్బాపూర్ లో బుధవారం బాలవికాస మహిళలు అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భర్త చనిపోయిన తర్వాత బొట్టు గాజులు తీసే సాంప్రదాయానికి స్వస్తి పలకాలని, మరణం సహజం, వితంతువులను శుభకార్యాల్లో పక్కకు పెట్టొద్దని కోరారు. సమాజంలో మూఢనమ్మకాలను రూపుమాపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోమలత, హైమవతి, బాలవికాస కోఆర్డినేటర్ స్వాతి పాల్గొన్నారు.